క్లుప్తంగా

ఒంగోలు-2 ఎంఈవోగా సరస్వతి



ఒంగోలు రూరల్: ఒంగోలు-2 ఎంఈవోగా సరస్వతి నియమితులయ్యారు. ఐదేళ్లుగా ముక్తినూతలపాడు హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె.. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా గొల్లగట్టు హెచ్‌ఎంగా వెళ్లారు. ప్రస్తుతం పదోన్నతిపై ఎంఈవోగా నియమితులయ్యారు.

కొప్పోలు చెరువును స్టోరేజీ ట్యాంకుగా మార్చాలి

ఒంగోలు టౌన్: స్థానిక కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ కోరారు. ఆదివారం కొప్పోలు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కొప్పోలుకు ఏడు రోజులకోసారి మంచినీరు వస్తున్నాయన్నారు. మూడు రోజులకోసారి సరఫరా చేయాలని కోరారు. చెరువు శుభ్రం చేసి ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పాత పైపులైను స్థానంలో కొత్తది వేయాలని, నాణ్యమైన పైపులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం కొప్పోలు కార్యదర్శి ఎస్.హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ఒంగోలు టౌన్: ఐసీడీఎస్‌కి బడ్జెట్ పెంచి అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని కోరుతూ జూలైలో కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న ధర్నాలను జిల్లాలో విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులోని నందూరి ప్రసాదరావు భవనంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆమె ప్రసంగించారు. అంగన్‌వాడీలను వర్కర్లుగా గుర్తించి గ్రాట్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌తో పాటు చివరి నెల వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. సర్వీసులో ఉండి మరణించిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా నాగార్పమ్మ కొలుపులు



తాళ్లూరు: అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు: విఠలాపురంలో ఆరు దశాబ్దాల అనంతరం రజక సంఘం ఆధ్వర్యంలో నాగార్పమ్మ కొలుపులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీర్ణావస్థకు చేరిన నాగార్పమ్మ దేవాలయంలో రజక సంఘం ఆధ్వర్యంలో కమిటీ ఏర్పడి జీర్ణోద్ధరణ చేశారు. అనంతరం రూ. 16 లక్షల వ్యయంతో గుడి నిర్మాణం, అన్నదానం నిర్వహించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు పలు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బంధు మిత్రులు రాకతో గ్రామం కళకళలాడింది.

పోలేరమ్మ తల్లి కొలుపులు

బొద్దికూరపాడులో పోలేరమ్మ తల్లి కొలుపుల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు, బంధు మిత్రులు రాకతో గ్రామం నూతన కళ సంతరించుకుంది.

గుంటి గంగా భవానికి పూజలు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పన్నెండు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 17,698 ఆదాయం వచ్చినట్లు ఆర్‌పీ శ్రీనివాసరావు తెలిపారు. దర్శి సీఐ రామకోటయ్య అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



విఠలాపురంలో నాగార్పమ్మకు పూజలు



నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసిన మోటుమాల పాఠశాల



మరుగుదొడ్లు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తగా.. మెరుగ్గా..!

- నాడు-నేడు అభివృద్ధి పనులతో కొత్తకొత్తగా ప్రభుత్వ పాఠశాలలు
- అన్ని వసతులతో కూడిన మెరుగైన విద్య
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు
- పెరిగిన విద్యార్థుల సంఖ్య

కొత్తపట్నం: ప్రతి పేద విద్యార్థికి సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులు సత్ఫలితాలిస్తున్నాయి. అందుకోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం ద్వారా కొత్తపట్నం మండలంలోని సర్కార్ స్కూళ్లన్నీ కొత్తదనాన్ని సంతరించుకున్నాయి. అన్ని వసతులతో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన జరుగుతోంది. తద్వారా విద్యార్థులు కూడా సౌకర్యవంతంగా, ఆసక్తిగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా మారిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇంగ్లిష్ మీడియం కూడా ఉండటంతో ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ స్కూళ్లకు మారిపోయారు. ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన విద్యాబోధన, సకల సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులంతా క్రమంగా ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టాపర్లుగా రాణించారు. నాడు-నేడు నిధులతో అదనపు తరగతి గదులు, గ్రీన్ బోర్డులు, పాత భవనాల ఆధునీకీకరణ, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు, కిచెన్ షెడ్ నిర్మాణం, ట్యాబ్‌లు, వాల్ ఆర్ట్స్, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్‌లు వంటివి నిర్మించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు, సాయంత్రం పూట స్టడీ అవర్స్ వంటివి నిర్వహించి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులు కావడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ విద్యా సంస్థల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

ఫేజ్-2లో 30 పాఠశాలలకు రూ.15 కోట్లు...

కొత్తపట్నం మండలంలో 53 పాఠశాలలకుగానూ నాడు-నేడు కార్యక్రమం ఫేజ్-1లో 16 పాఠశాలల అభివృద్ధికి రూ.3,30,85,496 మంజూరవగా పనులన్నీ పూర్తి చేశారు. ఫేజ్-2లో 30 పాఠశాలలకు రూ.15 కోట్లు మంజూరవగా ఇప్పటికే మూడొంతుల పనులు పూర్తి చేశారు. మండలంలోని మొత్తం 53 పాఠశాలల్లో 6,232 మంది విద్యార్థులు ఉండగా జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. 8వ తరగతి చదివే విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలుపుకుని 732 ట్యాబ్‌లు అందజేశారు. త్వరలో అమ్మ ఒడి నగదు జమ చేయనున్నారు.



వంటగది

సరికొత్త విధానాలతో ప్రభుత్వ పాఠశాలలు :



ప్రభుత్వ విద్యావ్యవస్థలో సరికొత్త మార్పులు రావడంతో ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తు బాగుపడుతోంది. విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోంది. ఎంతో ఖర్చు చేసి విద్యను ప్రోత్సహిస్తోంది. మంచి విద్యనభ్యసిస్తే వారి కుటుంబాలు బాగుపడతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం మంచి ఆలోచన చేసింది. మండలంలో 6,232 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగింది.

అజయ్‌బాబు, ఎంఈవో, కొత్తపట్నం

అన్ని వసతులు ఉన్నందుకే నాకు 580 మార్కులు వచ్చాయి :



మాది చాలా పేద కుటుంబం. నాన్న టైలరింగ్ చేసి నన్ను అల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివించాడు. పాఠశాలలో ఉపాధ్యాయులు బాగా చదువు చెప్పడం వలన, ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం పెట్టడం, ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక విద్య అందించడం వలన నేను పదో తరగతిలో 580 మార్కులతో మండలంలోనే మొదటి స్థానం సాధించాను.

షేక్ మైమూన్, విద్యార్థిని, అల్లూరు

మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించా :



నాకు నలుగురు కుమార్తెలు. అందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించా. ప్రభుత్వ విద్యా విధానంలో మంచి మార్పులు రావడం వలన పదో తరగతిలో నా పెద్ద కుమార్తె శశిరేఖకు 540 మార్కులు, రెండో కుమార్తె ఆలేఖ్య భవానికి 520, మూడో కుమార్తె అక్షయకు 536 మార్కులు వచ్చాయి. వారంతా ప్రస్తుతం వివిధ రకాల డిప్లమా కోర్సులు చదువుతున్నారు. నాలుగో కుమార్తె అవంతి ఈతముక్కల ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది.

తమలపాకులు రవీంద్ర, మడనూరు

విజయవంతంగా ముగిసిన పీఎంఏవై



కార్యక్రమంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శ్రీనివాస ప్రసాద్

చీమకుర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం జూన్ 25 నాటికి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం హౌసింగ్ డిపార్టుమెంట్ అధికారులు విజయోత్సవం నిర్వహించారు. చీమకుర్తి అర్బన్ పరిధిలోని కేవీ పాలెం లే అవుట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీనివాస ప్రసాద్, కమిషనర్ షేక్ ఫజులుల్లా, మెప్మా ఇన్‌చార్జి సంతోష్‌బాబు, ఏఈ గోపి పాల్గొన్నారు. స్థానిక పీఎంఏవై లబ్ధిదారులతో వారు మాట్లాడుతూ చీమకుర్తి అర్బన్ పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 1,792 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిలో బేస్‌మట్టం లెవల్‌కు పైన 1,141 ఇళ్లు పూర్తయినట్లు చెప్పారు. బేస్‌మెంట్ లెవల్‌లో 311, రూఫ్ లెవల్‌లో 104, నిర్మాణాలు పూర్తి చేసినవి 659 ఉన్నాయని తెలిపారు.

సాగర తీరంలో సండే సందడి



కొత్తపట్నం తీరంలో ఉన్న పర్యాటకులు

కొత్తపట్నం: కొత్తపట్నం సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సెలవుదినం కావడంతో ఒంగోలు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సందర్శకులు సముద్రతీరానికి తరలివచ్చి సందడి చేశారు. బీచ్‌లో యువకులు, చిన్నారులు, మహిళలు కేరింతలు కొడుతూ స్నానాలు చేశారు. సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులతో బీచ్ రద్దీగా మారింది. అల్పపీడనం కొనసాగుతున్నప్పటికీ వాతావరణం అనుకూలంగా ఉన్నందును సముద్రంలోకి పర్యాటకులను అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మెరైన్ సీఐ కట్టా శ్రీనివాసరావు సిబ్బందితో పర్యవేక్షించారు. మైక్‌తో ప్రచారం చేస్తూ నిఘా పెట్టారు.

రోడ్డుపైకి పెరిగిన చిల్లచెట్లు

- ప్రయాణికులకు ఇబ్బందులు



రోడ్డుపైకి వచ్చిన చిల్లచెట్ల కొమ్మలు

ఒంగోలు రూరల్: మండలంలో నూతనంగా నిర్మించిన కొప్పోలు-కరవది రోడ్డు పక్కన ఉన్న చిల్లచెట్ల కొమ్మలు రోడ్డుపైకి పెరగడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులకు తగులుతున్నాయి. రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రివేళ చిల్లచెట్ల కొమ్మలను గమనించిక గట్టిగా తగులుతుండటంతో ప్రయాణికులకు గాయాలవుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనానికి దారిచ్చేందుకు రోడ్డు చివరకు వెళ్లినప్పుడు ఏపుగా పెరిగిన చిల్లచెట్లు ప్రయాణికుల కళ్లు, మొహానికి తగిలి గాయాలవుతున్నాయి. ఈ చిల్లచెట్లను వెంటనే తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం



సమైక్యతా భావాన్ని చాటుతున్న ఆర్యవైశ్య నాయకులు

ఒంగోలు: స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య నాయకుడు పల్లపోతు వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు ఆర్యవైశ్యుల సమస్యలపై మాట్లాడారు. ఐకమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. నాయకత్వ లోప సమస్యను కూడా పరిష్కరించుకుందామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ కమిటీ ఏర్పాటు, కార్పొరేషన్‌కు నిధుల మంజూరు తదితరాలపై చర్చించారు. సమావేశంలో ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు రాకేష్, ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీరాం తాతయ్య, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే జె.వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ రాజారావుకు అభినందనలు

ఒంగోలు అర్బన్: గుంటూరు రీజినల్ ల్యాబొరేటరీలో గజిటెడ్ అధికారిగా పదోన్నతి పొందిన వినుకొండ రాజారావును ఒంగోలులోని నీటి పరీక్ష కేంద్రంలో పూర్వపు కార్యాలయ సిబ్బంది అభినందించి సత్కరించారు. ఫుడ్ ఆఫీస్ సూపరింటెండెంట్ మార్నేని వెంకటేశ్వరరావు, కోటపాటి శ్రీనివాసరావు, బూసరపల్లి గోవిందరావు, సుబ్బరాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు చెరువును స్టోరేజీ ట్యాంకుగా మార్చాలి

ఒంగోలు టౌన్: స్థానిక కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ కోరారు. ఆదివారం కొప్పోలు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కొప్పోలుకు ఏడు రోజులకోసారి మంచినీరు వస్తున్నాయన్నారు. మూడు రోజులకోసారి సరఫరా చేయాలని కోరారు. చెరువు శుభ్రం చేసి ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పాత పైపులైను స్థానంలో కొత్తది వేయాలని, నాణ్యమైన పైపులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం కొప్పోలు కార్యదర్శి ఎస్.హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా తిరుమంజనసేవ



తిరుమంజనసేవ నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

ఒంగోలు టౌన్: స్థానిక కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అభయాంజనేయస్వామికి తిరుమంజన సేవతో పాటు హనుమద్‌యాగాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు విశేష అలంకరణలో అభయాంజనేయస్వామి దర్శనమిచ్చారు. శ్రీ వెంకటేశ్వరస్వామికి తులసీ దళాలతో సహస్ర నామార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు పాల్గొని పర్యవేక్షించారు. ఈ నెల 23న ప్రారంభమైన అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

గుండె చికిత్సలో విప్లవాత్మక మార్పులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

కొత్తపట్నం: గుండె జబ్బులకు అందించే వైద్యంలో శాస్త్రీయపరంగా, సాంకేతికంగా ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్టు పోతినేని రమేష్‌బాబు అన్నారు. హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక నల్లూరు గార్డెన్ రిసార్ట్స్‌లో ఆదివారం వైద్య విద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఇటీవల ఆకస్మికంగా గుండెపోటు వచ్చి మరణించే వారి సంఖ్య పెరిగిపోయిందని తెలిపారు. అలాంటి మరణాలు 80 శాతం నివారింపదగినవేనని అన్నారు. కొత్తగా వచ్చిన పరీక్షల ద్వారా కొలెస్ట్రాల్ గడ్డలను ముందే గుర్తించి చికిత్స చేయించుకుని ఆకస్మిక గుండెపోటు మరణాలను నివారించవచ్చని తెలిపారు. దాగి ఉండే గుండె జబ్బును ఫ్యామిలీ ఫిజీషియన్ కూడా ముందే గుర్తించగలరని తెలిపారు. రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ మాట్లాడుతూ వైద్యులు నిరంతరం వైద్య రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటే రోగులకు శాస్త్రీయ పద్ధతుల్లో వైద్యం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రత్యక్షంగా 380 మంది డాక్టర్లు, ఆన్‌లైన్ ద్వారా 175 మంది డాక్టర్లు పాల్గొన్నారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రంగనాథ్‌బాబు, సెక్రటరీ డాక్టర్ మణిబాబు, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్లు వెలగా అనూప్, జయరామ్ పాయ్, బికాస్ సాహూ, బత్తిని రాజేష్, జ్యోతి ప్రకాష్, భరత్ సిద్ధార్థ, నిశ్చల్‌రెడ్డి, హరణి, పెరుమాళ్ల, కార్తీక్‌బాబు, ధరణి, పవన్, ధీరజ్, రవీంద్రరెడ్డి, వంశీకృష్ణ, అజయ్‌పవన్, శిల్ప, శరణ్, జహంగీర్, సుల్తాన్, ప్రతిమ, శ్యామ్‌సుందరి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్, కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలో మురుగు కాలువల్లో పూడికతీత పనులను డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణతో కలిసి కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. గాంధీ రోడ్డులో పర్యటించి పారిశుధ్య కార్మికులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంఈ మాల్యాద్రి, ఇంజినీరింగ్, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచనల నిప్పు రాజేసిన కవి.. మహాస్వప్న



మహాస్వప్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: తెలుగు ఆధునిక కవిత్వంలో దిగంబర కవిగా మహాస్వప్న ఆలోచనల నిప్పు రాజేశారని నాగభైరవ సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో నరసం కార్యాలయంలో ఆదివారం మహాస్వప్న 4వ వర్ధంతి నిర్వహించారు. దింగంబర కవిత్వం చూపిన ప్రభావం, కలిగించిన ప్రేరణ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. దిగంబర కవిత్వం కలిగించిన సంచలన ప్రభావం ఇంకా కొనసాగుతోందని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. మహాస్వప్న ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమరావు అన్నారు. తొలుత మహాస్వప్న చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, మహతి, తన్నీరు బాలాజీ, మిడసల మల్లికార్జునరావు, రత్నం, ఓరుగంటి ప్రసాద్, కొడాలి శిరీష, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.